వంశీ

# పొలమారిన జ్ఞాపకాలు



# మా పసలపూడి కథలు

వంశీ

సాహితి

మాట్లాడే జ్ఞాపకాలు

**వంశీ**

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2016

మూల్యం : రూ. **100/-**

లోపలి బొమ్మలు : **పాణి**

ప్రచురణ కర్త :

**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 520 002
ఫోన్ : 0866-2436642/43, 8121098500
**e-mail : sahithi.vja@gmail.com**




# అంకితం

అస్మదాప్త మిత్రులు డా॥ మన్నం చంద్రమౌళి గారికి

ఇష్టంగా — వంశీ

# విషయసూచిక


| | |
|---|---|
| కారణ జన్ముడి జీవిత కథ | 5 |
| అద్భుతం చేద్దామన్నాడు అంతలోనే వెళ్ళిపోయాడు | 10 |
| స్క్రిప్ట్ స్టోరీ బోర్డ్ | 15 |
| వెన్నెల్లో లాంచి ప్రయాణం | 16 |
| జ్ఞాపకాల వరండా మెట్ల మీద నిలబడి | 23 |
| సావిత్రిగార్ని చూడ్డం అలా మిస్సయ్యాను | 26 |
| నా మొదటి సినిమా | 31 |
| తల్చుకుంటేనే తన్మయత్వం | 34 |
| పసలపూడిలో సరదాగా కాసేపు | 38 |
| మాయమైపోయిన బాపులోని రమణీయం | 42 |
| మేము గోదావరీ కిన్నెరసాని | 46 |
| మై ఫేవరెట్ బుక్ | 59 |
| ఒక హార్మోనియం పెట్టి కథ | 62 |
| అనుకోకుండా రాసినవే | 66 |
| జక్కం వీరన్న మావూరివాడే | 69 |
| రవణాగారలా వెళ్ళిపోతే బాపుగారేమై పోవాలిక్కడ | 74 |
| ఆయనతో కొన్ని జ్ఞాపకాలు | 77 |
| హంపిలో వెన్నెల వెచ్చగా వుంది | 81 |
| ప్రయాణంలో కాస్సేపు... | 92 |
| జ్ఞాపకాలలో పసలపూడి | 100 |
| ఒక 'కీ' కథ | 103 |
| వి.రామన్నపాలెం | 109 |
| చాలా తక్కువ కాల్షీట్లు ఇచ్చాడు | 115 |
| హౌస్‌బోట్ లో హాయిగా గడిపాం | 118 |
| ముగ్గు మురిపెం | 123 |
| నా ఫెయిల్యూర్ స్టోరీ | 127 |
| హరివిల్లు నీడలో కాసేపు కూర్చుందాం | 134 |
| అదో అద్భుతమైన యాత్ర | 139 |
| కాకినాడలో రైలుబండెక్కి కోటిపల్లి వెళ్ళాం | 145 |
| ఉప్పుటేరు మీద ఒక ఊరు | 150 |
| శివుడి సన్నిధిలో శవదహనం | 155 |
| ఇవాళ మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ పుట్టినరోజు | 162 |
| ఒక శిథిల నగరం హంపీ విజయనగరం | 167 |
| గలగల పారే గోదారి ఒడ్డున | 180 |
| నా కాస్త బెస్ట్ అనిపించిన సినిమాలు | 186 |
| మాట్లాడే జ్ఞాపకాలు | 190 |

# కొరణ్ణ జన్మడి
# జీవిత కథ



ఇళయరాజా గారు తన జీవితంలో చాలా ఎక్కువసార్లు చూసిన సినిమా ఈ "ఎమేడియెస్".

"నువ్వూ చూడు" అన్నారు నన్ను... నా అభిమాన దర్శకుడు మిలాస్ ఫోర్‌మెన్ ఆరుసార్లు చూసేంత అద్భుతంగా సృష్టించారీ సినిమాని. వందల ఏళ్ళనాటి వాతావరణంలోకి నన్ను తీసుకెళ్ళిపోయారు. ఆనాటి వేషభాషలూ, కట్టుబాట్లూ అన్నీ నా కళ్ళముందు బొమ్మకట్టాయి. ఆ తర్వాత మొజార్ట్‌కి అభిమానినైపోయి అతని సింఫనీలు చాలా విన్నాను.

ఇళయరాజాకి ఈ సినిమా అంతగా నచ్చడానికి కారణం...ఇదొక మ్యూజికల్, మనసుని మా గొప్పగా పట్టేసుకున్న మొజార్ట్ కేరెక్టర్.

పదిహేడువందల ఏభైఆరులో ఆస్ట్రియాలో సాల్జ్‌బర్గ్ అనే టౌన్లో పుట్టి పదిహేడు వందల తొంభైఒకటిలో ఆ దేశానికి కేపిటల్ అయిన వియన్నాలో కేవలం ముప్పైదేళ్ళు మాత్రమే బతికి చనిపోయిన గ్రేట్ కంపోజర్ మొజార్ట్ ఆత్మకథ ఈ ఎమేడియెస్ సినిమా.

ఆ కాలంలో బేతోవెన్, బాక్, మొజార్ట్ వున్నట్టే మన సౌత్‌లో ముగ్గురు వాగ్గేయకారు లుండేవారు త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్.

ఇక మొజార్ట్ ఆత్మకథ సినిమాగా తీయబడిన ఎమేడియెస్ సినిమా విషయానికొస్తే... పీటర్ షాఫర్ రాసిన స్టేజ్‌ప్లేని స్క్రీన్‌కి అనువదిస్తే అమెరికాలో సెటిలయిన జెకోస్లేవేకియా వాడయిన ప్రొఫెసర్ మిలాస్‌ఫోర్‌మెన్ డైరెక్ట్ చేశారు.

మొజార్ట్ వేషాన్ని టామ్‌హల్క్ అద్భుతంగా చేస్తే, అంతకంటే అద్భుతంగా శైలోరి కేరెక్టర్ని ముర్రే అబ్రహాం చేశాడు. అతనిది చాలా ప్రతిభగలవాడయిన మొజార్ట్‌ని చాలా జెలసీతో చూస్తూ ఇంకోపక్కనించి ఆరాధించే సాటి మ్యూజీషియన్ కేరెక్టర్.

సినిమా టైటిల్స్‌లో మొదట ముర్రే అబ్రహాం పేరే వేశారు. అలా వేయడం చాలా సబబు.

ఈ సినిమాకి మ్యూజిక్ కొత్తగా కంపోజ్ చెయ్యలేదు. ఆనాడు మొజార్ట్ రాసిన సింఫనీలు, సొనాటోలు, శాంటాటాలు, ఒపేరాలను పేర్లల్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ లేని ఈ సినిమాకి ద గ్రేట్ సర్, నేవిల్లే మారినర్ కండక్టర్‌గా వ్యవహరిస్తూ సూపర్‌వైజ్ చేశారు.

ఇక కథ విషయానికొస్తే...క్రిస్టోఫ్ ఓల్ఫ్‌గేంగ్ ఎమేడియస్ మొజార్ట్ అతని అసలు పేరయితే...ఉల్ఫీ అనేది ముద్దు పేరు. మూడో ఏటనుంచే సంగీత సాధన చేస్తుంటాడు మొజార్ట్. కళ్ళకి గంతలు కట్టి వదిలేస్తే పియానో, వయోలా అత్యంత అద్భుతంగా వాయిస్తుంటాడు. అలా పెరిగి పెద్దవాడయిన మొజార్ట్ ఎనిమిదో ఏట కంపోజ్ చేసిన మొదటి సింఫనీ ఇ ఫ్లాట్ మేజర్ కె.16....ఆఖరి సింఫనీ సి. మేజర్ కె.551. చాలా పొడుగైన ఆ సింఫనీకి జూపిటర్ సింఫనీ అని పేరు పెట్టాడు.

శైలోరి అనే అతను రాత్రీ, పగలూ సంగీత సాధన చేస్తుంటాడు. మామూలు సాధన కాదు రాక్షస సాధన.కానీ, సింఫనీలో నాలుగు బార్ల లెంగ్త్ వున్న చిన్న ఫ్రేజ్ కూడా పక్కాగా వాయించలేడు. ప్లేయింగ్‌లో ఒక్క ఫ్లో రాదు.

రాత్రి పగలనక పిచ్చిపిచ్చిగా ఆకతాయిగా తిరుగుతాడు మొజార్ట్.తాగుతాడు, అమ్మాయిల్తో తిరుగుతాడు. అలా కలతిరిగి, తిరిగి సడన్‌గా పియానో ముందు కూర్చుని పరమాద్భుతంగా వాయిస్తాడు. ఒకోసారి చేతులు వెనక పెట్టి, కళ్ళుమూసుకుని కాళ్ళతో వాయిస్తుంటే మహారాజే మతిపోయి చూశాడదంతా.

అదంతా చూసిన శైలోరికి బుర్ర పనిచేయడం మానేస్తుంది. జీసస్ ముందుకెళ్ళి "ఇంత సాధన చేసిన నాకు అబ్బని విద్య ఏ కృషీ చెయ్యని వాడికెలా అబ్బుతుంది? అసలు వాడికెలా ఇస్తున్నావ్ అంత టేలెంట్‌ని" అని క్రాస్‌ని ఫైర్ ప్లేస్‌లో పారేస్తాడు. మొజార్ట్ ఎంత ప్రతిభగల వాడయినా అతను చేసే పిల్ల చేష్టలకి, పిచ్చి చేష్టలకీ రాజుగారి ఆస్థానంలో ఎవరూ గొప్పోళ్ళా చూసేవారుకాదు. కొందరైతే పట్టించుకునేవారు కాదు.

చాలా విచ్చలవిడిగా తిరుగుతూ, తాగుతుండడం వల్ల విపరీతమైన ఆర్థిక ఇబ్బందులకి లోనయిన మొజార్ట్ ఆ బాధల్ని మర్చిపోడానికి మరింతగా తాగడం మొదలెట్టాడు.

మొజార్ట్ ఆర్థిక బాధల్ని చూస్తున్న శైలోరి ఆ మొజార్ట్‌కి ఫైనాన్షియల్‌గా హెల్ప్ చేసి అతని ప్రతిభని దోచుకోవాలనుకుంటూ ఇంకోపక్క తనకి అన్యాయంచేసిన దేవుడి మీద కక్ష సాధించాలనుకుంటాడు.

మారువేషం వేసుకుని మొజార్ట్ దగ్గరకొచ్చిన శైలోరి "నీ ఆర్థిక ఇబ్బందులు నేను తీరుస్తాను. దానికి ప్రతిఫలంగా నా పేరుమీద ఒక సింఫని రాసిపెట్టాలి" అన్నాడు.

దానికి సరే అన్నాడు మొజార్ట్.

రాత్రీ పగలూ తాగుతా ఒక అద్భుతమైన సింఫనీ రాసి శైలోరీకిచ్చాడు మొజార్ట్.

ఇంకికక్కడ్నించి మొజార్ట్‌లో ప్రతిభని వాడుకుంటా రాజుగారి కొలువులో గొప్ప సంగీతకారుడిగా వెలిగిపోతున్నాడు శైలోరి. అలా వెలిగిపోడం వెనకాల మొజార్ట్ వున్నాడని అక్కడివాళ్ళెవరికీ తెలీదు.

మొజార్ట్‌లో ప్రతిభని వాడుకుని ఎదిగిపోతున్న శైలోరి ఇస్తానన్న డబ్బు ఇవ్వకుండా మొజార్ట్‌ని ఆర్థికంగా చాలా ఇబ్బందులుపెడతా మానసికంగా చాలా దిగజార్చే ప్రయత్నం చేస్తుంటాడు.

మొజార్ట్‌కీ అతని భార్యకీ మాటామాటా పెరగడంతో కొడుకుని తీసుకుని పుట్టింటికెళ్ళి పోయింది.

ఇంట్లో ఒంటరిగా వుంటున్న మొజార్ట్ శారీరకంగా, మానసికంగా చాలా క్షీణించి పోతున్నాడు. ఒకసారి ఒక స్టేజిషో క్లైమాక్స్‌లో పడిపోయిన మొజార్ట్‌ని ఇంటికి మోసుకెళ్ళాడు శైలోరి.

నీరసంగా మంచంమీద పడిపోయున్నాడు మొజార్ట్.

అదిచూసిన శైలోరి మనసు ఆనందంతో గంతులేస్తుంది. నెమ్మదిగా మొజార్ట్ దగ్గరకొచ్చిన ఆ శైలోరి "చూడు మొజార్ట్...ఇప్పుడు నువ్వు హెల్త్ బాగోక చాలా చాలా బాధపడ్తున్నావు. నువ్వు ఈ మంచం మీద విశ్రాంతి తీసుకుంటాకూడా ఒక సింఫనీ రాయొచ్చు... అలా రాయొద్దు. నువ్వు డిక్టేట్ చేస్తుంటే నేను రాసుకుంటాను" అని మొజార్ట్‌ని ఒప్పించేడు.

ఓ పక్కనించి అనారోగ్యంతో బాధపడుతున్న మొజార్ట్ అద్భుతంగా కంపోజ్ చేసి చెప్తుంటే రాసుకుంటున్నాడు శైలోరి.

తెల్లవారుఝామున బిడ్డతో పాటు ఇంటికొచ్చిన మొజార్ట్ భార్య దూరంగా చిన్నమంచం మీద శైలోరి పడుకుని వుండడం చూసి విస్తుపోయింది... తన భర్త టాలెంట్ వీడు దోచుకుంటున్నాడని క్షణాల్లో అర్థం చేసుకున్నదామె... చిందరవందరగా పడున్న కాయితాలు పోగేసి బీరువా లోపల దాచేసి తాళం వేసి భర్తవేపు తిరిగే సరికి చనిపోయివున్నాడా మొజార్ట్.

అలా వియన్నా నగరంలో వర్షం కురుస్తున్న ఆ ఉదయం పూట కాఫిన్ బాక్స్‌లో పెట్టిన మొజార్ట్ శవాన్ని ఒక అనాధశవంలా స్మశానానికి తీసుకెళ్ళి తీసిన గోతిలో ఆల్రెడీ పారేసి వున్న శవాల మధ్య ఈ శవాన్ని కూడావేసి చేటడు ఉప్పేశాడు కాటికాపరి.

కొన్నేళ్ళక్రితం, (ఈమధ్య కాలం చేసిన) మ్యూజిక్ డైరెక్టర్ చక్రిగాడు, నేను ఆస్ట్రియా వెళ్ళినప్పుడు, మొజార్ట్ పుట్టిన సాల్జ్‌బర్గ్ వెళ్ళాం.

ఇరుకైన సందుల్లో వున్న ఒక బిల్డింగ్‌లో అతి చిన్న అపార్ట్‌మెంట్లో వున్న ఆ గదిలో చిన్న ఉయ్యాల అందులో చంటిబిడ్డ బొమ్మ, గమ్మత్తుగా లైటింగ్ చేశారు. వందల ఏళ్ళ క్రితం అక్కడ పుట్టాడట మొజార్ట్. వేలాది సందర్శకుల మధ్యనున్న మేం చాలా థ్రిల్ ఫీలయ్యాం.

ఒకచోట ఆనాటి మొజార్ట్ సింఫనీలని సి.డిలు చేసి అమ్ముతున్నారు. కొని డిస్క్‌మేన్లో వింటూ ఆ కాలానికెళ్ళిపోయాం. ఆ సంగీతం ఇప్పటికీ ఎప్పటికీ కొత్తకొత్త అనుభూతుల్నిస్తూ రాజిల్లుతుంది, విరాజిల్లుతుంది.

ఇంకక్కడినించి ఎక్కడికెళ్ళినా మొజార్ట్ పేరే. కేవలం మొజార్ట్ పేరు మీద బతుకుతుందా నగరం... ఎక్కడ చూసినా మొజార్ట్ పేరే.

హోటళ్లు, వైన్‌షాపులూ,గన్నులు,పెన్నులూ, దువ్వెనలు, గుండుసూదులు ఇలా ఒకటేమిటీ అన్నీ ఆ గ్రేట్ మొజార్ట్ పేరు మీద.

ఆ వైభవం చూస్తూ అందరూ అనుకుంటున్న మాటే మేమూ అనుకున్నాం.... "మనం మామూలు మనుషులం. ఈ మొజార్ట్ ఆ దేవుడు ప్రత్యేకంగా సృష్టించిన మనిషి, మహామనీషి.

అలాంటి కారణజన్ముడి జీవితకధని ఆండ్రిక్ ఫొటోగ్రఫీతో, సెర్నీ ఆర్ట్ డైరెక్షన్‌లో పిస్టెన్ కాస్ట్యూమ్స్‌లో ఫోర్‌మెన్ డైరెక్షన్‌లో ఒక అద్భుత కావ్యాన్ని సృష్టించారు.

# అద్భుతం చేద్దామన్నాడు
# అంతలోనే వెళ్ళిపోయాడు



పొద్దుటే ప్రొడ్యూసరు పిన్నింటి శ్రీరామ్‌రెడ్డి గారి దగ్గర్నుంచి ఫోను.

“మీరు బాగా బాధపడే బేడ్ న్యూస్ ఒకటి చెప్పాల్సొస్తుంది...”

కాస్త కంగారుపడ్డా, “చెప్పండి పర్లేదు” అన్నాను.

“చక్రీ పోయాడండీ”

“ఏంటీ?”

“మ్యూజిక్ డైరెక్టర్ చచ్చిపోయాడు”

మెదడులో నరాలకి కరెంట్ షాక్ కొట్టింది. కాళ్ళు కుదించుకుపోయినియ్యి, కళ్ళకి చీకటి, ఊపిరాగిపోయింది, నాకేం అర్ధంకావట్లేదు.

ఈలోగా పొన్నూరు నించి క్రిష్టేశ్వర్రావు ఫోను “సార్ టీ.వీ చూస్తున్నాను. చక్రీ చనిపోవడం....”

అంతా అయోమయంగా వుంది. ఈలోగా బల్గేరియా నించి కీరవాణి గారు ఫోను, “చక్రీకి సంబంధించి మీరు తప్ప నాకెవరూ తెలీదు. ఇంత చిన్న వయసులో అతను కాలం చేయడం చాలా దారుణం కదండీ! అతని ఆత్మకి శాంతి చేకూరాలని ప్రార్ధిస్తున్నాను. సార్”

❁ ❁ ❁

నిర్మాత శ్రీరామ్‌రెడ్డి గారి కంపెనీ నించొచ్చిన కారెక్కి చక్రి బాడీ వున్న అపోలో ఆసుపత్రి వేపెళ్తున్న నా మనసు, శరీరం నా ఆధీనంలో లేవు.

వెళ్తుంది కారు.

కాసేపయ్యింది, జారిపోతున్న నా మనసుని కంట్రోల్లోకి తెచ్చుకుని చక్రి జ్ఞాపకాల్లోకెళ్ళే ప్రయత్నం చేశాను.

2002లో... మద్రాసునించి హైదరాబాదొచ్చినప్పుడు, చిన్నవాళ్ళతో చిన్న సినిమా తియ్యాలనుకుంటున్న రోజులు.

మాస్ట్రో... ఈ చిన్న బడ్జెట్టుకాయన్ని తట్టుకోలేం, ఆయనలాంటోడు ఈ హైదరాబాద్‌లో కాదు ఈ ప్రపంచంలోనే ఎక్కడా దొరకడు. ఎవడో ఒకడితో సర్దుకుపోవాలి. అనుకుంటున్న టైములో "మళ్ళీ కూయవే గువ్వా..." పాట వినిపించింది. మళ్ళీ విన్నాను... బాగుంది, మళ్ళీ మళ్ళీ విన్నాను నిజంగా బాగుంది. ఈ సినిమాకి ఇతనే మ్యూజిక్ డైరెక్టరు అనుకుని అతని పేరేంటో అని వాకబుచేస్తే చక్రి అని చాలా కంఫర్టబుల్ కుర్రోడు అని తెల్సింది.

చక్రితో సినిమా మొదలయ్యింది. "ఔను...వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు" సినిమా, దాంట్లో పాటలు చాలా హిట్టయ్యాయి.

అప్పట్నించి మొదలయ్యింది పటిక బెల్లం లాంటి మనసుగల చక్రితో నా ప్రయాణం.

సీనియర్‌గా నాకు కొండంత గౌరవం ఇస్తూ కోరింది చేసేవాడు. ఇద్దరం కల్సి ఆరు సినిమాలు చేశాం. మధ్యలో ఆ నిర్మాత అడిగాడని శ్రీ ఇళయరాజాతో చేశాను ఓ సినిమా.

సంగీత దర్శకుడిగా ఎంత గొప్పోడో, మనిషిగా అంతకు పదింతలు గొప్పోడు చక్రి. సినిమాలకి సంపాదించిన డబ్బుకంటే బోల్డుమంది స్నేహితుల్ని సంపాయించిన మా గొప్పోడు. అంతా ఆగష్టు పదినాడు ఫ్రెండ్షిప్‌డే జరుపుకుంటారు. స్నేహానికి ప్రాణం పెట్టే చక్రిగాడు మాత్రం స్నేహితులందర్ని పోగేసి ఫిబ్రవరి పదిన జరుపుకుంటాడు పండగ. అభిమానిని అని పలకరించినవాడికి ప్రాణం ఇచ్చేస్తాడు.

❀ ❀ ❀

"ఇళయరాజాతో చేసినా మీ దగ్గర భలేగా కుదిరిపోయాడండీ చక్రీ" అంటుంటారు చాలామంది... నా దగ్గరే కాదు ఎవరి దగ్గరైనా ఇట్టే కుదిరిపోతాడు, ఇట్టే కలిసిపోతాడు. నా దగ్గర నాలా వుంటాడు, మీ దగ్గర మీలా వుంటాడు. అదీ వాడి గొప్పదనం.

ఇద్దరం కల్సి గోదాట్లో పడవ ప్రయాణం చేశాం. కేరళలో కలతిరిగాం, యూరప్‌లో కొన్ని దేశాలు తిరిగి కొన్ని ట్యూన్లు కట్టుకొచ్చాం.

ఇద్దరికీ తిండిగోలే. నేను వండేవాణ్ని, వాడు తినేవాడు. అందుకే లావైపోయాడనుకుంటున్నారేమో.... వాడిది వంశీపారంపర్యం కాదు... వంశపారంపర్యం.

సంగీతంతో పాటు సాహిత్యమన్నా చాలా ఇష్టం వాడికి. పసలపూడి కథలు, దిగువ గోదావరి కథలు, ఆకుపచ్చని జ్ఞాపకం, వంశీకి నచ్చిన కథలు కట్టలకి కట్టలు విశాలాంధ్రలో కొని, వాడి ఆఫీసుకొచ్చిన వాళ్ళకి పంచిపెట్టేవాడు. కొన్ని పాటలకి పల్లవులు తనే అనుకునేవాడు. అలా అనుకున్న చాలా పాటలు సూపర్ హిట్టు...

❀ ❀ ❀

అంతకుముందు అభిమానినని ఫోన్ చేసిన ఒక మనిషి నాలుగోసారి ఫోన్ చేసి "సార్! నా నెలల బిడ్డ చావుబతుకుల్లో వుంది...తెల్లారితే ఆపరేషన్... మీరో అరవై వేలు హెల్ప్ చెయ్యండి ప్లీజ్" అన్నాడు.

ఇదే ఇంకొకళ్ళయితే సౌండొచ్చేలాగ నవ్వేసి, సైలెంట్‌గా ఫోన్ కట్‌చేసేస్తారు.

చక్రి మాత్రం అలా చెయ్యలేదు.

కరుణతో కరిగిపోయాడు.

"ఇప్పుడు టైమెంత?"అన్నాడు.

"రాత్రి పన్నెండు సార్" అన్నాడు అభిమాని.

"ఆపరేషనెప్పుడు" చక్రి.

"రేపొద్దుట పదింటికి" అభిమాని.

"మీ ఊరెక్కడ?" చక్రి.

"సూర్యాపేటకి కూసిమంచికీ మధ్యనున్న మారుమూల పల్లెటూరు" అభిమాని.

"నన్నడగడానికెందుకింత ఆలశ్యం చేశావ్?" చిరాగ్గా అడిగేడు చక్రి.

"చాలాచోట్ల ట్రై చేశాను, ఎక్కడా దొరక్క మీకు ఫోన్ చేస్తున్నాను" ఏడుస్తా.

"ఏడిశావ్‌లే..." ఇంతరాత్రిపూట ఆ మూలనించి నా దగ్గరకొచ్చి ఎప్పుడు డబ్బు తీసుకెళ్తావ్....ఎప్పుడాహాస్పిటల్లో కట్టి నీ బిడ్డకి ఆపరేషన్ చేయిస్తావ్?" చక్రి అడిగిందానికి మాటాడ్లేదు అభిమాని.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Matlade+Gnapakalu**

* * *